జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 3 | నవంబర్ | 2025 ◆ పేజీలు : 8

# జిల్లా ఆరోగ్య కార్యక్రమాలపై సిఆర్ఎం బృందంతో కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సమీక్షా



**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 2, ప్రజా జ్యోతి** జిల్లాలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించేందుకు సిఆర్ ఎం బృందం ఆదివారం జిల్లాను సందర్శించింది. ఈ సందర్శనలో భాగంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధ్యక్షతన సిఆర్ఎం బృంద సభ్యులు, జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖాధికారులు, ప్రోగ్రాం అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో



- కాంగ్రెస్, బిఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ
- పార్టీ కార్యాలయంలోని ఫర్నిచర్ ధ్వంసం
- పార్టీ కార్యాలయం పై కాంగ్రెస్ జెండా ఎగరవేసిన కార్యకర్తలు
- పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు, 144 సెక్షన్ అమలు

# కాంగ్రెస్ కార్యాలయాన్ని... స్వాధీనం చేసుకున్నారు...

ఎట్టకేలకు మణుగూరులోని కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్యకర్తలు నాయకులు టిఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ జెండా నిలబెట్టి, కార్యాలయాన్ని స్వాధీన పరుచుకొని కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. పార్టీ కార్యాలయం ముందు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. నియోజకవర్గ నలు దిశల నుండి భారీగా కదిలి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు ఒక్కసారిగా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై మెరుపు దాడి చేశారు. ఈ నేపథ్యంలో మా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ సామాగ్రి దేనికి అంటూ కుర్చీలు, బీరువాలు, ఫ్లెక్సీలు పెట్రోల్ బోసి తగలబెట్టారు.

2 లో...



## రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు
# పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 2, ప్రజా జ్యోతి** పినపాక మండలం ఏడూళ్ళ బయ్యారం జడ్పీహెచ్ఎస్ పాఠశాల లో నవంబర్ 8, 9 _ 10 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి బాలబాలికల అండర్–17 కబడ్డీ పోటీలు, అదేవిధంగా జనవరి నెలలో నిర్వహించనున్న జాతీయస్థాయి బాలుర కబడ్డీ పోటీలకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పినపాక జెడ్పీహెచ్ ఎస్ హైస్కూల్ ఆవరణలో కబడ్డీ పోటీల నిర్వహణకు చేపడుతున్న ప్రాంగణ నిర్మాణం, కోర్టుల స్థల వ్యవస్థాపన, వసతి, భద్రతా చర్యలు, మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

మిగతా 2 లో...

# మావోయిస్టుల డంప్ స్వాధీనం



**చర్ల, నవంబర్ 2 (ప్రజాజ్యోతి):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ గరియాబంద్ జిల్లాలోని దట్టమైన అడవుల్లో పోలీసులను లక్ష్యంగా చేసుకుని నక్సలైట్లు పన్నిన కుట్ర భగ్నంఅయింది. ఖచ్చితమైన నిఘా సమాచారం మేరకు జిల్లా పోలీసు దళం ఆపరేషన్ గ్రూప్ ఈ – 30 బృందం మూడు వేర్వేరు డంప్ల నుండి పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలు ఐ ఈ డి తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకుంది. ఈ చర్య మావోయిస్టు ఉదంటి ఏరియా కమిటీ ప్రణాళికలను భగ్నం చేసింది. ఈ ఆపరేషన్ సమయంలో ఒక రహస్య సమాచారం మేరకు ఆదివారం బృందం తెల్లవారుజామున అనుమానాస్పద డంప్ ప్రాంతాన్ని కనుగొంది. బాంబు నిర్వీర్య దళం బృందాన్ని వెంటనే అప్రమత్తం చేశారు. క్షుణ్ణంగా శోధించిన తర్వాత మూడు వేర్వేరు ప్రదేశాలలో భూగర్భంలో పాతిపెట్టబడిన మావోయిస్టు డంప్ ను కనుగొంది. ఈ ప్రదేశాలను జాగ్రత్తగా తవ్వినప్పుడు అక్కడ నక్సలైట్లు పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను భూగర్భంలో సురక్షితంగా దాచిపెట్టారు.జిల్లా ప్రధాన కార్యాలయం నుండి దాదాపు 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న థానా శోభా థానా పైలిఖండ్ (జుగాడ్)

మిగతా 2 లో...

## రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)



రాష్ట్ర స్థాయిలో జరగబోయే ఈకబడ్డీ పోటీలు భవిష్యత్తులో జాతీయస్థాయి పోటీలకు వేదికగా మారబోతున్నాయని, కావున భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతిష్టకు తగ్గట్టుగా ఈ కార్యక్రమాలు అత్యుత్తమ ప్రమాణాలతో నిర్వహించాలి అని అధికారులను కోరారు, దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి క్రీడాకారులు, అధికారులతో పాటు జిల్లాలోని ప్రముఖులు, అనేకమంది ప్రజలు పాల్గొనే అవకాశమున్నందున సదుపాయాల విషయంలో ఎలాంటి లోపాలు ఉండకుండా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. కబడ్డీ పోటీల నిర్వహణకు మొత్తం నాలుగు కోర్టులను ఏర్పాటు చేయాలని, కానీ వీక్షకుల రాకపోకలకు ఆటంకం కలగకుండా ట్రాఫిక్ కంట్రోల్ దృష్ట్యా కోర్టులను సముచిత దూరంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాల ప్రహరీ గోడను తాత్కాలికంగా తొలగించి పక్కనే ఉన్న అటవీ శాఖ నర్సరీ ప్రదేశాన్ని వినియోగించడం ద్వారా స్థలం విస్తరించి, పోటీలు సౌకర్యవంతంగా నిర్వహించగలమని ఆయన సూచించారు. గ్రౌండింగ్ కోసం గ్రావెల్ ను తక్షణమే సమకూర్చి పనులు పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యుత్, నీటి సరఫరా, శానిటేషన్, ఆరోగ్య శిబిరం, ఫస్ట్ ఎయిడ్ సదుపాయాలు, పార్కింగ్ స్థలాలు, వాహనాల రాకపోకల నియంత్రణ, భద్రతా సిబ్బంది నియామకం వంటి అంశాలపై ప్రతి శాఖ సమన్వయంతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆయన సూచించారు. జిల్లా యువజన సర్వీసులు , క్రీడా శాఖ, విద్యాశాఖ, పోలీసు శాఖ, పంచాయతీ రాజ్, విద్యుత్, అటవీ, ఆరోగ్య శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు సమయానుకూలంగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఎంపీ ఓ వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఏ ఈ , సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆరోగ్య కార్యక్రమాలపై సిఆర్ఎం బృందంతో కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సమీక్షా



(మొదటి పేజీ తరువాయి...)

జిల్లాలో అమలు జరుగుతున్న ప్రధాన ఆరోగ్య కార్యక్రమాలు, జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలు, మాతా–శిశు ఆరోగ్యం, వ్యాధి నియంత్రణ చర్యలు, వైద్య సేవల విస్తరణ, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యత తదితర అంశాలపై చర్చించారు, సిఆర్ఎం బృందం నవంబర్ 3వ తేదీ నుండి 7వ తేదీ వరకు జిల్లాలోని వివిధ ప్రభుత్వ వైద్య సంస్థలను సందర్శించి, ఆరోగ్య సేవల అమలు స్థాయిని, సిబ్బంది పనితీరును, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించనున్నట్లు తెలిపారు, ఈ సందర్భంగా బృందం వైద్య సదుపాయాల అందుబాటు, మౌలిక వసతుల వినియోగం, రోగులకు అందిస్తున్న సేవల నాణ్యతను కూడా విశ్లేషించనున్నట్లు తెలిపారు, ఈ బృందంలో డా. గురిందర్ బీర్ సింగ్ – అడ్వైజర్, సి పి సి, పిహెచ్సి , ఎన్ హెచ్ ఎస్ ఆర్ సి డా. బి. వెంకట శివారెడ్డి , అసిస్టెంట్ ప్రొఫెసర్, ఏఐఐ ఎంఎస్ మంగళగిరి, డా. అజయ్ పాండే – అసిస్టెంట్ ప్రొఫెసర్, పి ఆర్ సి లక్నో, డా. అంకిత కంకర్య – అసిస్టెంట్ ప్రొఫెసర్, పి జి ఐ ఎం ఈ ఆర్ డా. అనర్ సింగ్ డాకర్ – సీనియర్ కన్సల్టెంట్, ఎన్ హెచ్ డా. కల్పనా భవానియ – సీనియర్ కన్సల్టెంట్ అధికారులు సభ్యులుగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. జయలక్ష్మి, వివిధ ఆరోగ్య ప్రోగ్రాం ఆఫీసర్లు, జిల్లా ఆరోగ్య అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్నారు





**మణుగూరు, నవంబరు 02, (ప్రజా జ్యోతి):** ఎట్టకేలకు మణుగూరులోని కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్యకర్తలు నాయకులు టిఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ జెండా నిలబెట్టి, కార్యాలయాన్ని స్వాధీన పరుచుకొని కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. పార్టీ కార్యాలయం ముందు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. నియోజకవర్గ నలు దిశల నుండి భారీగా కదిలి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు ఒక్కసారిగా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై మెరుపు దాడి చేశారు. ఈ నేపథ్యంలో మా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ సామాగ్రి దేనికి అంటూ కుర్చీలు, బీరువాలు, ఫ్లెక్సీలు పెట్రోల్ బోసి తగలబెట్టారు. మండలంలోని పార్టీ కార్యాలయం కోసం బగ్గుమన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఒక్కసారిగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పార్టీ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకొన్నారు. పార్టీ కార్యాలయంలోని బిఆర్ఎస్ కు సంబంధించిన సామాగ్రిని పెట్రోల్ పోసి కాల్చివేశారు. అనంతరం సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన కార్యాలయానికి చేరుకొని అక్కడ ఉన్న పరిస్థితులను అదుపు చేసి బందోబస్తు నిర్వహించారు. గతంలో రేగా కాంతారావు కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కాంగ్రెస్ నిధులతో పార్టీ కార్యాలయాన్ని నిర్మించారు. కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత 2014లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రేగా కాంతారావు బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని రేగా కాంతారావు స్వాధీన పరుచుకొని దానిని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంగా చేశారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి ఓ సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఉన్న రేగా కాంతారావు బిఆర్ఎస్ పార్టీలోకి వెళ్లి ఇందిరమ్మ కార్యాలయాన్ని కబ్జా చేసి కార్యకర్తల మీద అక్రమ కేసులు పెట్టారని తెలిపారు. మీరు అధికారంలో ఉన్నారని మీకు నచ్చినట్లు చేస్తున్నారని మళ్లీ మేము అధికారంలోకి వస్తే మా కార్యాలయాన్ని మేము స్వాధీనం చేసుకునే రోజులు అతి త్వరలోనే ఉన్నాయని రేవంత్ రెడ్డి ఆ సమావేశంలో తెలియజేశారు. ఆనాడు తెలియజేసిన విధంగానే ఆదివారం ఉదయం నియోజకవర్గంలో నలుమూలల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉప్పెనలా పెద్ద ఎత్తున ర్యాలీతో బయలుదేరి జై కాంగ్రెస్ జై రేవంత్ రెడ్డి, జై పాయం అన్నా అంటూ నినాదాలు చేసుకుంటూ కార్యాలయాన్ని చుట్టుముట్టి కార్యాలయంలో ప్రవేశించి బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన సామాగ్రిని ధ్వంసం చేసి కాల్చివేశారు. అనంతరం పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు పక్షాలను బెదరగొట్టి ప్రశాంత వాతావరణంనెలకొల్పి భారీ బందోబస్తు నిర్వహించి 144 సెక్షన్ అమలు చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్, పార్టీ మధ్య ఘర్షణల నేపథ్యంలో 144 సెక్షన్ అమలుపరచి పట్టణంలో భారీ పోలీస్ భద్రత ఏర్పాట్లు నిర్వహించారు. ముగ్గురు కంటే ఎక్కువ ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమాచారం తెలుసుకున్న రేగ కాంతారావు హైదరాబాద్ నుంచి హుటాహుటిన బయలుదేరి మణుగూరు చేరుకొని ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భౌతిక దాడులకు భయపడేది లేదని ఎంత రెచ్చగొడితే అంత ఎక్కువ ప్రశ్నిస్తామని ఫ్లెక్సీ కట్టినంత మాత్రాన ఒరిగేదేమి లేదని దీనికి కాలమే సమాధానం చెబుతుందని అన్నారు. ఎవరూ లేని సమయంలో భౌతిక దాడులకు పాల్పడడం సిగ్గుచేటని అన్నారు. మీకు దమ్ము ధైర్యం ఉంటే నాపై దాడి చేయండి, అంబేద్కర్ సెంటర్లో ఉంటా అని కాంగ్రెస్ శ్రేణులకు సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయ స్థలం కొనుగోలు చేసినట్లు నా వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ మీదని డాక్యుమెంట్లో ఉంటే నేను ఖాళీ చేసి వెళ్తా అంతేకానీ పాయం వెంకటేశ్వర్లు నీకు దమ్ము ధైర్యం ఉంటే నాపైన దాడి చేయాలని హెచ్చరించారు. నాతోటి మిత్రులపై దాడి చేసి నా పర్నిచర్ దగ్ధం చేసి నేను లేని సమయంలో అరాచకం సృష్టించడం పిరికిపంద చర్య అని అన్నారు. అన్ని నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ జెండా ఎగరవేసే అంతవరకు విశ్రమించేది లేదని ఘాటుగా హెచ్చరించారు. మణుగూరు కాంగ్రెస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. ఎవరిని వదిలేది లేదని హెచ్చరించారు.








## మావోయిస్టుల డంప్ స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి...)

ప్రాంతాల దట్టమైన ప్రవేశించలేని అడవులలో ఈ హై–రిస్క్ ఆపరేషన్ జరిగింది. సైబింకచార్, కొడోమాలి భూత్బెడ అటవీ ప్రాంతాలలో మావోయిస్టులు పోలీసులకు గ్రామస్తులకు భారీ నష్టాన్ని కలిగించాలని పోలీసులకు వారి స్థానిక నిఘా నెట్వర్క్ నుండి విశ్వసనీయ సమాచారం అందింది. ఈ సమాచారం ఆధారంగా, ఆదివారం జిల్లా పోలీసు దళానికి చెందిన ఆపరేషన్ టీం ఈ –30 దట్టమైన అడవులు కొండ ప్రాంతాలలో శోధన ఆపరేషన్ ప్రారంభించింది. బలగాలు స్వాధీనం చేసుకున్న డంప్ వివరాలు పెద్ద మొత్తంలో ఐ ఈడీలు తయారు చేయడానికి పేలుడు పదార్థం, నాలుగు కుక్కర్లు (కుక్కర్ బాంబులు తయారు చేయడానికి),విద్యుత్ తీగల కట్టలు,బాణసంచా (బహుశా పేలుడు పదార్థాల లోవాడటానికి), పెద్ద మొత్తంలో అటవీ ఆశ్రయం ప్రణాళిక కోసం దాచిపెట్టిన డంప్ ను స్వాధీనం చేసుకున్నారు.పోలీసు అధికారుల వివరాల ప్రకారం ఈ సామగ్రిని భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకోవడానికి కుక్కర్ బాంబులను మావోయిస్టు లు తరచుగా ఉపయోగిస్తారు అని గరియాబంద్ పోలీసుల ఈ – 30 బృందం యొక్క అప్రమత్తత మావోయిస్టు వ్యూహాన్ని సకాలంలో అడ్డుకుంది అని ఈ ప్రాంతంలో శోధన కార్యకలాపాలు జరుగుతున్నాయి అని అధికారులు తెలియచేసారు .





## చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

- రైతాంగ సమస్యల పరిష్కారానికి ఏఐకేఎంఎస్ పిలుపు.




**టేకులపల్లి,నవంబర్02,ప్రజాజ్యోతి:** రైతాంగం పండించిన ప్రతి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల10వ తేదీ కలెక్టరేట్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఎర్రాయి గూడెంలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు.అనంతరం ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్,ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భుక్య హర్జ మాట్లాడుతూ రైతు పండించిన మొక్కజొన్న పత్తి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వారు డిమాండ్ చేశారు.సిసిఐ కేంద్రాలను టేకులపల్లి సెంటర్లో ఏర్పటు చేయాలని తేమతో సంబంధం లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తడిసిన మొక్కజొన్నలను ప్రభుత్వమే సెంటర్స్ ని ఏర్పాటు చేసి కొనుగోలు తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతాంగ తదితర సమస్యలపై కలెక్టరేట్ కార్యాలయం ముందు జరుగు ధర్నాను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు,ఎట్టి నరసింహా రావు,భానోత్ హరి సింగ్, బాబూ లాల్,శంకర్,బాబు,సామ్య తది తరులు పాల్గొన్నారు.

## ఈనెల 18న పాల్వంచలో జరుగు పిడిఎస్ యు మహాసభను విజయ వంతం చేయండి

- మహాసభ ల ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా సింగు ఉపేందర్ రావు




**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 2, ప్రజా జ్యోతి** ఈనెల 18న పాల్వంచలో నిర్వహించనున్న పిడిఎస్ యు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని పిడిఎస్ యు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గౌని నాగేశ్వరరావు, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు సింగు ఉపేందర్ రావు లు పిలుపునిచ్చారు, ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో వారిరువురూ మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రజా సమస్యల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన చరిత్ర పి డి ఎస్ యు కి ఉందని ఎంతోమంది మేధావుల్ని కార్యకర్తలని భవిష్యత్తు తరాలకు అందించిన ఒక పరిశ్రమ పి డి ఎస్ యు అని వారన్నారు.పి డి ఎస్ యు రాష్ట్ర మహాసభల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో నిర్వహిస్తున్న 4వ జిల్లా మహాసభ సందర్భంగా పాల్వంచ పట్టణములో నవంబర్ 18న జరిగే మహాసభలకు ప్రతి ఒక్కరు హాజరై మహాసభల విజయవంతం చేయలని వారు కోరారు, అనంతరం మహాసభల సందర్భంగా సభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా ఉపేందర్ రావు ఎన్నిక కావడంతో పలువురు వర్షం వ్యక్తం చేశారు, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి డి ప్రణయ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పి డి ఎస్ యు మాజి నాయకులు వి రఘు, ఎస్కే ఉమర్,ఎన్ సంజీవ్,జక్కుల రాంబాబు, సాగర్,మోహన్ ఉపేందర్, రాజేష్ నరసింహారావు, ప్రస్తుత పిడిఎఫ్ నాయకులు జీవన్ వరుణ్ టి లక్ష్మణ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిధుల దుర్వినియోగం ఇదిగో సాక్ష్యం



- **ప్రజల సొమ్ముతో రియల్ ఎస్టేట్ లకు రోడ్లు.**
- **జనావాసాలు లేని సిసి రోడ్ల వద్ద సిపిఐఎం ఆందోళన**

**భద్రాచలం టౌన్, నవంబర్ 2ప్రజా జ్యోతి ):** ప్రజాధనాన్ని వృధా చేస్తూ జనావాసాలు లేని చోట సిసి రోడ్లను నిర్మిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లబ్ధి చేకూర్చే ప్రభుత్వ అధికారుల తీరుని ఎండగట్టడమే కాకుండా నిధుల దుర్వినియోగాన్ని సిపిఐఎం సాక్షాలతో రుజువు చేస్తుందని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి స్పష్టం చేశారు.గత నెలలో సిపిఐఎం చేపట్టిన పాదయాత్రలో పాదయాత్రలో వెలికి తీసిన విధుల దుర్వినియోగంపై గత నెల 31 తారీఖున గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు నిర్వహించిన ఆందోళన సందర్భంగా గ్రామపంచాయతీ నిధులు దుర్వినియోగంపై సిపిఎం చేసిన ఆరోపణలను రుజువు చేస్తూ ఆదివారం అశోక్ నగర్ కొత్త కాలనీ ఇండస్ట్రీ ఏరియా లో కనీస నివాస గృహాలు కాదు కదా కనీసం ప్రజలు సంచరించని ప్రాంతంలో సుమారు 20 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన సిసి రోడ్డు వద్ద సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డం స్వామి మాట్లాడుతూ 40 ఏళ్ళ క్రితం ఏర్పడ్డ కొత్త కాలనీలో అనేక వీధులలో సిసి రోడ్లు కాదు కదా సైడ్ రైలు కూడా లేకుండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజల నివాస ప్రాంతంలో అభివృద్ధి చేయకుండా ఎవరి స్వార్థం ప్రయోజనాల కోసం జామాయిల్ తోటలో సిమెంట్ రోడ్డు నిర్మించారో ప్రభుత్వ అధికారులు చెప్పాలని అన్నారు. ప్రజల అవసరాల కోసం అభివృద్ధి జరగాలి తప్ప రాజకీయ నాయకుల వ్యాపారాల కోసం ప్రజా సొమ్మును దుర్వినియోగం చేస్తుంటే సిపిఐఎం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

- **నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి......!**
- **సిపిఐఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు**

జనావా అసలు లేనిచోట సిసి రోడ్లు నిర్మిస్తూ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయటంపై విచారణ చేపట్టాలని సిపిఐఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు డిమాండ్ చేశారు. సిపిఎం చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూనిధుల దుర్వినియోగంపై పంచాయతీ ఈవోని ప్రశ్నిస్తే తమకు సంబంధం లేదని ఎంపీ ఎమ్మెల్యే గ్రాంట్ ల నుండి నిర్మించిన రోడ్లన్నీ చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఏ ప్రజాప్రతినిధి నిధులైన తీర్మానం చేయాల్సింది గ్రామపంచాయతీ అధికారులు కాదా అని ఆయన ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై స్పందించని ప్రభుత్వ అధికారులు ప్రజల సొమ్ముతో రాజకీయ నాయకులకు లబ్ధి చేకూర్చే పనులు చేయటం ఏమిటని అన్నారు. పట్టణంలోని శాంతినగర్ శివారు ప్రాంతంలో జన సంచారం లేని చోట పది లక్షల రూపాయల సీసీ రోడ్డు నిర్మించారని కొత్త కాలనీ జామాలి తోటలో కూడా 20 లక్షల రూపాయల నిధుల దుర్వినియోగం జరిగిందని వీటిపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాలని లేని యెడల సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సంతోష్ కుమార్, పట్టణ కమిటీ సభ్యులు చాట్ల శ్రీనివాసరావు, కుంజా శ్రీను , నకిరేకంటి నాగరాజు, ఎస్.అజయ్ కుమార్, కోరాడశ్రీనివాస్,శాఖ కార్యదర్శిలు గోవర్ధన ఝాన్సీ, చెన్నూరి వెంకటరమణ, ఎర్రం శెట్టి పూర్ణిమ,నాయకులు దారిశెట్టి సతీష్ బాబు, కర్నాటి రామాంజనేయులు, అన్నం వెంకట్ ,రవీంద్ర,కళావతి హైమావతి, సరోజినీ, జానకమ్మ, రమణ,తదితరులు పాల్గొన్నారు..

## ఉమ్మడి ఖమ్మం జిల్లా ఫుడ్ బాల్ జట్టుకు ఎంపికైన దొడ్డిపట్ల పునీత్



**భద్రాచలం టౌన్, నవంబర్ 2(ప్రజాజ్యోతి):** ఆర్కె షాపింగ్ మాల్ అధినేత దొడ్డిపట్ల సత్య లింగం మనవడు, భద్రాచల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యదర్శి దొడ్డిపట్ల కోటేష్ తనయుడు దొడ్డిపట్ల పునీత్ జిల్లా అండర్ 14 ఫుడ్ బాల్ టీమ్ కు ఎంపిక అయ్యారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 400 మంది క్రీడాకారులు ఈ ఎంపికలో పాల్గొనగా, తుదిజెట్టుగా 16 మందిని సెలెక్టర్లు ఎంపిక చేయడం జరిగింది. ఎంపికైన 16 మందిలో భద్రాచలం ప్రాంతం నుంచి దొడ్డిపట్ల పునీత్ ఎంపిక కావటం భద్రాచలం వాసులు, క్రీడాకారులు క్రీడా అభిమానులు అందరూ హర్షం వ్యక్తం చేశారు. వికారాబాద్ కేంద్రంగా జరుగుతున్నటువంటి రాష్ట్రస్థాయి ఫుడ్ బాల్ పోటీలలో దొడ్డిపట్ల పునీత్ మంచి ప్రతిభ కనబరచాలని భద్రాచల ప్రాంతవాసులందరూ కోరుకుంటున్నారు.

## భద్రాచలం సబ్ కలెక్టర్, కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయాల్లో ప్రజావాణి

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**కొత్తగూడెం కలెక్టరేట్ , నవంబర్ 2, ప్రజా జ్యోతి** జిల్లాలోని భూసమస్యల పరిష్కారానికి ప్రజలు సుదూర ప్రాంతాల నుండి సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నందున, వారి సౌకర్యార్థం డివిజన్ల వారీగా ప్రజావాణి నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలం డివిజన్ పరిధిలోని ప్రజలు – భూసమస్యల పరిష్కారం కోసం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ప్రజావాణి నిర్వహిస్తారని, అదేవిధంగా కొత్తగూడెం డివిజన్ పరిధిలోని ప్రజలు – భూసమస్యల పరిష్కారం కోసం కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ప్రజావాణి నిర్వహిస్తారని తెలిపారు, ఇతర సమస్యల పై దరఖాస్తు చేసుకునేవారు కలెక్టరేట్లోని ఇన్వార్డ్ నందు తమ దరఖాస్తులను అందజేసి రసీదు పొందగలరని దరఖాస్తుల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

## పాల్వంచలో హిందూ–ముస్లిం ఐక్యతకు నిదర్శనం

- ముస్లిం యువకుడు ఎస్కే కలీష్ ద్వారా అయ్యప్ప స్వాములకు అన్నదానం.



**పాల్వంచ టౌన్, నవంబర్ 2 (ప్రజాజ్యోతి):** కులమతాలకు అతీతంగా ఐక్యతను చాటుతూ పాల్వంచ పట్టణంలోని ముస్లిం యువకుడు ఎస్కే కలీష్ ప్రతి ఏడాది కార్తీకమాసంలో మాలధారణ అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.ఆదివారం స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆయన ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో దీక్షలు చేస్తున్న సుమారు 500మంది మాలధారణ స్వాములకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. హిందూ భక్తులకు అన్నదానం చేసిన ఈ ముస్లిం యువకుడి సేవా భావం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంలో మాలధారణ స్వాములు ఎస్కే కలీష్‌ను సన్మానించి, ఆయన సేవా మనసును అభినందించారు. “హిందూ ముస్లిం భాయ్ భాయ్” అంటూ ఐక్యతా సందేశాన్ని పంచారు.కార్యక్రమంలో యమహా రమేష్, అక్రమ్,బి.శ్రీనివాస్ గురుస్వామి, భోగినేని శీను,సాయిని మహేంద్ర చౌదరి,భోగినేని సందీప్,బేతం శెట్టి వెంకట,మల్లెల నాగేందర్,రెడ్డి మల్ల మణికంఠ,ఎన్.పి.చారి,రాజ్యలక్ష్మి కిషోర్ తదితరులు పాల్గొన్నారు. కులమతాలకు అతీతంగా మానవతా విలువలతో ముందుకు సాగుతున్న ఎస్కే కలీష్ సేవా కార్యక్రమం ప్రశంసనీయమని పలువురు అభిప్రాయపడ్డారు.

## కాంచనపల్లి అమరవీరుల త్యాగం గొప్పది.

- సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు




**టేకులపల్లి,నవంబర్ 02, ప్రజాజ్యోతి:** కాంచనపల్లి అమరవీరుల త్యాగం గొప్పది అని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు అన్నారు.రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా టేకులపల్లి మండలం కిష్టారంలో ఆదివారం కాచనపల్లి బూటకపు ఎన్కౌంటర్లో మరణించిన మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలు కామ్రేడ్ చింత లక్ష్మి స్తూపం పై సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కామ్రేడ్ కల్తీ వెంకటేశ్వర్లు జండా ఎగరవేశారు. అనంతరం ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు డి. ప్రసాద్ ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఎట్టి నరసింహారావు భుక్య హర్జా పాల్గొని,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాచనపల్లిలో మండల వైస్ ఎంపీపీగా ప్రజా ప్రతినిధిగా ఉన్న కామ్రేడ్ చింత లక్ష్మక్కను పాలకులు బూటకపు ఎనక కౌంటర్లో హత్య చేసి ఎన్కౌంటర్ కట్టు కథ అల్లారని వారు ఆరోపించారు. ప్రజాదరణ కలిగిన గిరిజన నాయకురాలని అతి తక్కువ సమయంలోనే మంచి పేరు సంపాదించిన గిరిజననాయకు రాలని వారు అన్నారు.పేద ప్రజలను గిరిజనులను కూడగట్టి ఫారెస్ట్ ప్రభుత్వ దోపిడీలకు వ్యతిరేకంగా గిరిజన ప్రజానీకాన్ని కూడ గట్టిన గిరిజన నాయకురాలు చింతా లక్ష్మి అని వారు అన్నారు. గోదావరి లోయ ఉద్యమంలో ఎంతోమంది వీరులు పేద ప్రజల కోసం తమ రక్తాన్ని ధారపోశారని వారి అడుగు జాడల్లో నేటి యువత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. పాలకులు మార్క్సిజానికి కాలం చెల్లిందని అంటున్నారని కానీ మార్క్స్ నిజమే అజయమైనదని వీరులు అమరులని వారు ప్రజల గుండెల్లో చిరకాలం ఉంటారని అన్నారు. వారు అందించిన ఆశయాల సాధనలో ముందుకు వెళ్ళడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జబ్బా జోగయ్య, కంగాల బుచ్చయ్య, కంగాల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక సాగు కి ఆయనే ఆరాధ్యుడు

- వాణిజ్య పంటల సాగుకు బాటలు వేసిన మార్గదర్శి
- లాభదాయక వ్యవసాయం వైపు రైతును నడిపిస్తున్న నాయకుడు
- తమ వ్యవసాయ క్షేత్రంలో వక్కసాగు చేపట్టిన తుమ్మల ఆసక్తి చూపిస్తున్న ఇతర రైతులు
- ఒక్కసారి పంట వేస్తే 60 ఏళ్లకు పైగా ఆదాయం
- ఆయిల్ ఫామ్ కొబ్బరి పంటలలో అంతర్ పంట గాను సాగుకు అనుకూలం



**అశ్వారావుపేట, నవంబర్ 02,ప్రజా జ్యోతి:** సుమారు 35 సంవత్సరాల క్రితం తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగు చేపట్టిన... కోకో, జాజి కాయ వంటి అంతర పంటలకు శ్రీకారం చుట్టిన.. నేడు వక్క సాగు చేపట్టి మరో నూతన వరవడికి బాటలు వేసిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను లాభదాయక వ్యవసాయం వైపు నడిపించడమే లక్ష్యంగా మరో మారు సిద్ధమయ్యారు. కర్ణాటక రాష్ట్రంలో రైతులు సాగు చేస్తున్న వక్క సాగు గురించి తెలుసుకున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల దమ్మపేట మండలంలో గల తమ సొంత వ్యవసాయ క్షేత్రంలో ఒక్క సాగు చేపట్టారు ప్రస్తుతం అది కాపు దశకు రావడంతో మండలంలోని రైతులతో పాటు జిల్లా వ్యాప్తంగా రైతులు సాగు చేస్తున్న వక్క సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

హిందూ సాంప్రదాయం ప్రకారం వక్క లేదా పోకచెక్క అపురూప వస్తువు. పూజా కార్యక్రమాల్లో వక్కలు వాడే ఆచారం కొనసాగుతుంది. వివాహాది శుభకార్యక్రమాల్లో అందించే తాంబూలాలలో మూడు తమలపాకులు, రెండు వక్కలు ఉండాలన్నది సాంప్రదాయం. చిన్న చిన్న గ్రామాల్లో కూడా ప్రస్తుత కాలంలో వక్కపొడి అమ్మే దుకాణాలు అనేకం. మన వాళ్ళు వాడే కారా, జరదా కిళ్ళీలు పచ్చి వక్క లెకుండా తయారు కావు. అంతటి ప్రాధాన్యత కలిగిన వక్కను మనం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవటం మినహా మరో గత్యంతరం లేదు. అలాంటి వక్కసాగుపై దృష్టి సారించి నేడు ఫల సాయాన్ని పొందుతున్నారు ఆధునిక రైతు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల...

### వక్క సాగుఎలా... రైతుకు అందే ఆదాయం ఏంటి..?

ఒక్క సారి పంట వేస్తే దీర్ఘకాలం దిగుబడినిస్తుంది వక్క తోట సాగు. తక్కవ రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులతో నీటి లభ్యత పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో అధిక మొత్తంలో ఆదాయం ఘడించవచ్చు. అందుకే రైతులు ఈ పంట ద్వారా లాభాలు పొందవచ్చని భావించిన మంత్రి తుమ్మల ముందుగా తానే వక్క పంటను పండించి అనుభవపూర్వకంగా రైతులకు అందించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని పంట వేశారు ఆయిల్ ఫామ్ పంట సాగుతో అశ్వారావుపేట నియోజకవర్గం తో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా వాతావరణంలో వేడి తక్కువగా ఉండడంతో ఈ పంటనే సాగు ఈ ప్రాంతం అనువుగా మారనుంది ఒక్క ఎకరం పొలంలో 450 నుంచి 500 వక్క చెట్లను నాటవచ్చు. ఐదేళ్ల వరకూ వక్క పంట చేతికి రాకపోయినా ఐదేళ్ల నుంచి ఏటా ఒక్క పంట చేతికి వస్తుంది. ఎకరాకు ధరలు బాగుంటే రూ రెండు నుంచి మూడు లక్షల వరకూ రైతులు ఆదాయం పొందవచ్చు.ఒక్క చెట్టు నుంచి గరిష్టంగా 100కేజీల వరకు పచ్చి వక్క కాయలు వచ్చే అవకాశం ఉంటుంది. దాని నుంచి 30 శాతం వరకూ వక్క వస్తూంది. మార్కెట్ లో ధరలు పెరుగుదల ఉంటే మరింత లాభాలు వచ్చే అవకాశం ఉంది. విత్తన కాయల నుంచి మొక్కలను పెంచి భూమిలో నాటే వక్క చెట్లకు ఎటువంటి రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడాల్సిన అవసరం లేదు. సేంద్రీయ ఎరువలు ఏడాదికి ఒక్క సారి మాత్రమే వేస్తారు. డ్రిప్ ద్వారా సరిపడా నీరు వదులుతారు. వక్క కాయలు పక్వానికి వచ్చిన సమయంలో కేవలం నాలుగు నెలలు మాత్రమే పని ఉంటుంది, మిగిలిన ఎనిమిది నెలలు చెట్ల సంరక్షణ చూసుకోవాలి. పెట్టుబడి తక్కువగా ఉండడం అధిక లాభాలు వస్తూండడంతో వక్క పంట రైతుకు ఎలా చూసినా మేలే చేస్తుంది.



## హక్కుల సాధనకై పోరాటం.

- జై సేవాలాల్ మహారాజ్” నినాదాలతో లంబాడీ హక్కుల సదస్సు.



**పాల్వంచ(రూరల్), నవంబర్ 02(ప్రజా జ్యోతి):** లంబాడీ హక్కుల సాధనకై “నంగార బేరి లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్ హె పి ఎస్)” ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో మేధావులు,విద్యార్థి సంఘాలు,ఉద్యోగ సంఘాల సన్నిధిలో విస్తృత స్థాయి సదస్సు జరుగుతోంది.ఈ సదస్సు ఎల్ హె పి ఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు వడ్త్యా దాసు రామ్ నాయక్,రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ నాయక్ నాయకత్వంలో నిర్వహించబడుతోంది. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే కుట్రలు పన్నుతున్న కోయగోండు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు,మాజీ ఎంపీ సోయం బాబురావు లాంటి నేతలు లంబాడీలపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ,సుప్రీం కోర్టు వరకు వెళ్ళిన నేపథ్యంలో ఈ అంశంపై మేధోమథనానికి సదస్సు ఏర్పాటయ్యింది.ఈ సదస్సు హైదరాబాద్ సామ్రాట్ కామర్షియల్ కాంప్లెక్స్,ఏ జి ఆఫీస్ ఎదురుగా జరుగుతోంది.రాబోయే రోజుల్లో లంబాడీ సమాజం ఎదుర్కోబోయే సవాళ్లు,వాటిని ఎలా ఎదుర్కోవాలో ఈ సమావేశంలో చర్చించనున్నారు. భద్రాద్రి,ఖమ్మం ఉమ్మడి జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో ఎల్ హె పి ఎస్ నాయకులు హైదరాబాద్ బయలుదేరారు.వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ కుశ నాయక్,రాష్ట్ర కార్యదర్శి గుగులోత్ కృష్ణ నాయక్,ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దశరథ్ నాయక్,ఉపాధ్యక్షుడు బానోత్ నందు నాయక్,వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ లాకావత్ నాగేశ్వరరావు నాయక్ ఉన్నారు.నాయకులు ఖమ్మం రైల్వే స్టేషన్ వద్ద సంప్రదాయ రొట్టెలు,గోడ్డు కారం తింటూ ఉత్సాహంగా “జాగో బంజారా,మారో నంగారా” నినాదాలతో సికింద్రాబాద్ వైపు ప్రయాణమయ్యారు.

## ఘనంగా సమాధుల పండుగ



**ఇల్లందు, నవంబర్ 2, ప్రజాజ్యోతి:** ఈ లోకం విడిచి పరలోకానికి వెళ్లిన తమ కుటుంబ సభ్యులు, బంధువులను సమాధుల పండుగ రోజున కీర్తించటం క్రైస్తవుల ఆనవాయితీ. పిల్ల పాపలతో కలిసి సమాధులను అలంకరించి కొవ్వొత్తులను వెలిగించి ప్రత్యేక ప్రార్ధనలు చేయటం ప్రత్యేకత. ఆదివారం సాయంత్రం పట్టణంలోని బందెల మల్లయ్య కుంట ప్రాంతంలో గల సమాధుల వద్ద సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు సమాధులను విద్యుత్ దీపాలు కొవ్వొత్తులతో అలంకరించి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. సమాధుల పండగ సందర్భంగా స్మశాన వాటిక విద్యుత్ దీపాలు వెలుగాయి. క్రైస్తవ సోదరులు నిర్వహించిన సమాధుల పండగ ప్రత్యేక ప్రార్ధనలకు పలువురు పట్టణ ప్రముఖులు హాజరై పరలోకానికి వెళ్లిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్ధన చేశారు. సమాధులను వివిధ రకాల పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి తీర్చిదిద్దారు. సిఎస్ఐ చర్చి ఫాస్టేట్ చైర్మన్ రెవరెండ్ దైవ ప్రతాప్ మరియు గ్రూప్ చైర్మన్ రెవరెండ్ సునీల్ శ్రీధర్, బి. రాజేంద్ర బాబు అయ్యగార్లు, చర్చి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ పండుగ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో చర్చి సెక్రటరీ తోకల ఏసురత్నం, ట్రెజరర్ జయ రాజు సంఘ పెద్దలు, సంఘస్తులు యువకులు పిల్లలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై దాడిని ఖండించిన సారపాక బిఆర్ఎస్ శ్రేణులు

- కాంగ్రెస్ పాలన రాజకీయమా? రౌడీయిజమా..?:కొనకంచి
- పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేసి దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి



**బూర్గంపహాడ్, నవంబర్ 2 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై దాడి చేసి ఫర్నిచర్ తగులబెట్టి పార్టీ శ్రేణులపై దాడి చేసి పార్టీ కార్యాలయాన్ని ఆక్రమించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సారపాక పట్టణ అధ్యక్షులు కొనకంచి శ్రీను అన్నారు. ఈ సందర్భంగా సారపాక ప్రధాన కూడలి నందు బూర్గంపహాడ్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, పట్టణ అధ్యక్షులు కొనకంచి శ్రీను ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సరికాదని, పది ఏళ్ల పాలన లో బిఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసి నేర్చుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ప్రజలు గమనిస్తూనే ఉన్నారని..రాబోయే రోజుల్లో కెసిఆర్ ప్రభుత్వమే పరిపాలన సాగిస్తుందని అన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకుని ప్రజలకు ఉపయోగ పడే కార్యక్రమాలు చేయాలని తెలిపారు. లా అండ్ ఆర్డర్ సైతం అధికార మదం ముందు నిద్రావస్త నటిస్తుందని దుయ్యబట్టారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వెంటనే దాడికి యత్నించిన ప్రతి ఒక్కరిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేనిచో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, పట్టణ అధ్యక్షులు కొనకంచి శ్రీను, బెజ్జంకి కనకాచారి, యేసోబు, వలదాసు సాలయ్య, కె వి రమణ, తుపాకుల రవి, నాగేశ్వరావు, యువజన విభాగం కృష్ణ, చైతన్య రెడ్డి, పంగి సురేష్, మూడ్ మణికంఠ, ధర్మసోత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు...

## బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య

- బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బొమ్మెర్ల వర ప్రసాద్



**టేకులపల్లి, నవంబర్02, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం లోని మణుగూరు కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ను కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ పార్టీ ఆఫీసు ను ధ్వంసం చేయడం హేయమైన చర్యఅని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బొమ్మెర్ల వరప్రసాద్ అన్నారు. ఇల్లందు నియోజకవర్గం ఇంచార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ పిలుపుమేరకు ఆదివారం బిఆర్ఎస్ పార్టీ కార్యాల యంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంను కాంగ్రెస్ పార్టీ నాయకులు ధ్వంసం చేయడంతో దాని ఖండిస్తూ ప్రెస్ మీట్ నిర్వహించారు. మండల అధ్యక్షులు బొమ్మెర్ల వరప్రసాద్ మాట్లాడుతూ పినపాక మాజీ శాసన సభ్యులు, ప్రజాపాలన అని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు అరాచకాలు కి పాల్పడటం సిగ్గుచేటు. భద్రాద్రి జిల్లాలో పలు సమస్యలు పైన గలమెత్తి ప్రశ్నిస్తుంటే అభివృద్ధి చేయలేక దౌర్జన్యలకు పాల్పడుతున్నారు. చట్టం ముందు అందరూ సమానులే " అని ఇంగీత జ్ఞానం లేకుండా వారి దగ్గర నిరాధార మైన ఆరోపణలు తో ఫర్నిచర్ దగ్ధం చేయడం అటవీక చర్య పాల్పడటం దుచర్య. ముగ్గురు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యే లు ఉన్నా నిధులు తీసుకురాక అభివృద్ధి చేయక ప్రశ్నిస్తే దాడులకు పాల్పడటం మేన ప్రజాపాలన. భవిష్యత్తు లో తగిన మూల్యం చెల్లించక తప్పదు. దీనిపై కండించిన వారిని అధికార బలం తో అరెస్ట్ లు చేయడం సిగ్గుచేటు. తక్షణమే వారి పైన చర్యలు తీసుకొని అరెస్ట్ చేయాలనీ బిఆర్ఎస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు బానోత్ రామ, మాజీ ఎంపీటీసీ జాలాది అప్పారావు, బిఆర్ఎస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు ఆమెడ రేణుక, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భూక్యా లాలూ నాయక్, ఆంగోత్ లక్పతి నాయక్, నాన్ బాల భిక్షం, జర్పుల రాజు, కొండ బత్తుల శ్యామ్, కొత్త చిట్టి రాజు, వాంకు డోత్ సందీప్, ఆర్. రాంబాబు, రవి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నాం

- బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు



**చర్ల, నవంబర్ 02:(ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెంజిల్లా మణుగూరు బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని చర్ల బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతరావు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు రేగ కాంతారావు జిల్లాకు జరుగుతున్న నష్టాన్ని ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన పోరాడుతుంటే తట్టుకోలేక కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ కార్యాలయంపై దాడి చేశారని. ప్రశాంతంగా ఉన్న జిల్లాను భ్రష్టు పట్టించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తుందని రాష్ట్రంలో అరాచక పరిపాలన నడుస్తుందని అని అన్నారు .గత పది సంవత్సరాలలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితులు చూడలేదని కానీ కాంగ్రెస్ గద్దెనెక్కిన రెండు సంవత్సరాలలో రాష్ట్రం మొత్తం రౌడీ రాజ్యం నడుపుతుందని సామాన్య ప్రజలు సైతం భయపడే పరిస్థితి నెలకొందని దాడి జరిగే సమయంలో బి ఆర్ ఎస్ నాయకుల పై దౌర్జన్యం చేసారు అని అన్నారు . ఈ దాడికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేకపోతే వెంటనే దాడికి పాల్పడిన వారినీ అరెస్ట్ చేసి కేసు నమోదు చెయ్యాలని డిమాండ్ చేస్తూ ఇలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కో కన్వీనర్ అయిన వోలు పవన్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, పంజా రాజు , కాకి అనిల్ ,గోరింట్ల వెంకటేశ్వరరావు, అంబోజి సతీష్, కుప్పాల నిరంజన్, కోరం కన్నారావు, ఎడ్ల రాందాస్, కట్టం కన్నారావు, తుర్రం రాజు, కొంగూరి సోమరాజు, మునిగల సాంబ ,గాదం శెట్టి కిషోర్ ,కుక్కడపు సాయి, సృజన తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల దాడిపై టిఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం



**ఆళ్ళపల్లి. నవంబర్ 2.ప్రజాజ్యోతి** మణుగూరు పట్టణంలోని టిఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని టిఆర్ఎస్ ఆళ్ళపల్లి మండల అధ్యక్షుడు నరసింహారావు తీవ్రంగా ఖండించారు. ఇది "హేయమైన, ఆటవిక చర్య" అని ఆయన అభివర్ణించారు. టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు, రోడ్ల దుస్థితిపై, ప్రజల సమస్యలపై సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం వల్లే కాంగ్రెస్ సమాధానం చెప్పలేక ఈ దాడులు చేయిస్తోందని ఆయన ఆరోపించారు. విమర్శలు, ప్రతివిమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమని, కానీ కాంగ్రెస్ పాలన వచ్చాక దాడులు, విద్వేష విష సంస్కృతి పెరిగిపోయిందని విమర్శించారు. కేసీఆర్. పాలనలో ప్రశాంతంగా ఉన్న తెలంగాణ, ఏడాది కాంగ్రెస్ పాలనలో అశాంతి, అలజడికి నిలయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహంతోనే దాడులు జరుగుతున్నాయని, దాడి చేసిన వారిని వెంటనే గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే చూస్తూ ఊరుకునేది లేదని, కాంగ్రెస్ అరాచకాలను అడ్డుకుంటామని టిఆర్ఎస్ హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కొమరం హనుమంతరావు, మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవికొమరం వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి బాబా నాయకులు, రాంబాబు నరసింహారావు కిషోర్ బాబు సాంబయ్య సత్యం నరేష్సుధాకర్ పాల్గొన్నారు.

## కిష్టా శ్రీనివాస్ పై దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి

- - కిష్టా శ్రీనివాసుని పరామర్శించిన గిరిజన,దళిత వికలాంగుల సంఘాలు

**భద్రాచలం టౌన్, నవంబర్ 2(ప్రజాజ్యోతి )** భద్రాచలం పట్టణంలోని జగదీష్‌కాలనీ లో ఒక వికలాంగుడైన గిరిజన జాతికి చెందిన కిష్టా శ్రీనివాసరావు దంపతులను అమానుషంగా ఓ యువకుడు దుర్భశలాడి అమానుషంగా వారిపై దాడి చేసిన వైనం చోటుచేసుకుంది. ఈ వికలాంగుడి పై దాడిని పలు కుల సంఘాలు ప్రజా సంఘాలు ఆ దంపతులను పరామర్శించి తీవ్రంగా ఖండించాయి. ఈ సందర్భంగా బాస్ కమిటీ సీనియర్ నాయకులు కుంజా ధర్మ రావు, పూనెం కృష్ణ దొర, మాజీ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అలవాల రాజా పెరియార్, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పౌల్ రాజ్ , ఆటో జేఏసి అధ్యక్షులు మర్మం శంకర్, వికలాంగుల సంఘం అధ్యక్షులు ఊటుకూరి సాయి రామ్ అన్నం సత్తిబాబు, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు మేకల లత, పరివర్తన యశోద ఫౌండేషన్ సేవాసమితి అధ్యక్షులు కొమ్మగిరి వెంకటేశ్వర్లు లు మాట్లాడుతూ భద్రాచలం పట్టణంలోని జగదీష్‌కాలనీ లో నివాసం ఉంటున్న వికలాంగుడు అయిన కిష్టా శ్రీనివాస్ ఆదివాసి దంపతులను వారి ఇంట్లోనే రెంటుకుంటున్న యువకుడు ఇంట్లో ఉన్న వారి పైన దౌర్జన్యంగా అనేక బూతులు తిడుతూ భౌతిక దాడికి పాల్పడ్డాడు ఈ సంఘటన అత్యంత దారుణమైన సంఘటనగా పేర్కొంటున్నామని వారు అన్నారు. అమానుషంగా దాడి చేయడం సరైనది కాదని ఇటువంటి దాడులు పునరావతం కాకుండా పోలీస్ అధికారులు చట్టపరమైన చర్యలు చేపట్టాలని వారు పేర్కొన్నారు. అదేవిధంగా ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వారు అన్నారు. తక్షణమే పోలీస్ అధికారులు సమగ్రమైన దర్యాప్తు నిర్వహించి గిరిజన దంపతులను దాడి చేసిన వారిపైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని, దివ్యాంగుల చట్టం 2016 92/A మరియు B లను వర్తింపజేసి, కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని వారు ఈ సందర్భంగా పోలీస్ అధికారులను కోరారు. దాడికి గురైన కిష్టా శ్రీనివాస్ దంపతులను పరామర్శ చేసిన వారిలో మాల మహానాడు వంశి, ఏజెన్సీ ప్రజా సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి కనకం శ్రీమన్నారాయణ ఆటో జేఏసీ మర్మO శంకర్ పరివర్తన యశోద ఫౌండేషన్ సేవా సమితి అధ్యక్షులు కొమ్మ గిరి అప్పన దాస్ బాబు పిలక నాగేందర్ రెడ్డి కుచర్ల కుమారి, కొప్పుల నాగమణి తదితరులు పాల్గొన్నారు

## కన్నీటితో సమాధుల పండుగ



**టేకులపల్లి,నవంబర్02,ప్రజాజ్యోతి:** చనిపోయిన కుటుంబీకుల ఆత్మలకు శాంతి కలగాలని ముత్యాలంపాడు క్రాస్ రోడు గ్రామంలో క్రైస్తవుల సమస్త సమాధుల ఆత్మల పండుగ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి ఆర్.సి.యం చర్చి ఫాదర్ ఆర్లయ్య, సీఎస్ఐ పాస్టర్ మనోహర్లు సమాధుల దగ్గర ప్రత్యేక ప్రార్థనలు చేయడం ద్వారా చనిపోయిన తమ వారికి ఆత్మలకు శాంతి కలుగుతుందని క్రైస్తవుల నమ్మకం.ప్రపంచ వ్యాప్తంగా కాథలిక్లు ఈ సమాధుల పండుగను జరుపుకుంటారు. ఈ కార్యక్రమంలో కాలే ప్రసాద్ రావు,కాలే భాస్కరరావు, అంతోటి రాకేష్, రాము, కాలే అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుపై దళారీ వ్యవస్థను అరికట్టాలి.

- పాయం సత్యనారాయణ



**చర్ల, నవంబర్ 02:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో ఆదివారం గుంపెన గుడెం గ్రామంలో ఇర్పరాజు అధ్యక్షతన జీఎస్ పీ సమావేశం జరిగింది .ఈ సమావేశంలో ఆదివాసి సంఘాల సమన్వయ కమిటీ జాయింట్ యాక్షన్ కమిటీ కో చైర్మన్ పాయం సత్యనారాయణ మాట్లాడుతూ ఏజెన్సీలో ధాన్యం కొనుగోలుపై దళారీలు విచ్చలవిడిగా ఆదివాసి ప్రజానీకంను మోసం చేస్తూ, వడ్లు కొనుగోలు లో తేమశాతం వంకతో పచ్చి వరి ధాన్యం కొనుగోలులో దళారీ వ్యవస్థ ఏకమై ఆదివాసి రైతులకు అన్యాయం చేసేందుకు కంకణం కట్టుకున్నారు అని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ భద్రాద్రి జిల్లా కలెక్టర్ దృష్టిసారించాలని ప్రభుత్వం తక్షణమే సీసీ కొనుగోలు కేంద్రాలు అర్హులైన ఇందిరా క్రాంతి మహిళ సంఘాలతోని కేంద్రాలు ఏర్పాటు చేసి దాని ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలని మెంథా తుఫాను కారణంగా నష్టం జరిగిన ఆదివాసి రైతుల ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ మంత్రివర్యులు ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో ప్రభుత్వం పై ఆదివాసి సంఘాలు పోరాటం చేస్తామని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ కో– కన్వీనర్ ఇర్ప ప్రకాష్ దొర,గొండ్వాన సంక్షేమ పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంట్,పూనెం. వరప్రసాద్ దొర, చర్ల జేఏసీ నాయకులు, నూప.రమేష్, తుర్రం రాజు. సోడి.రాజేష్, తుర్రం. రవి, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడి

### తీవ్రంగా ఖండించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరి బాబు



**జూలూరుపాడు నవంబర్ 2 ప్రజా జ్యోతి** ప్రజల పక్షాన ప్రశ్నిస్తే దాడి చేస్తారా, ఈ దాడి ఓ పిరికి పంద చర్య అని వైరా నియోజకవర్గ నాయకులు లాకావత్ గిరిబాబు మండిపడ్డారు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కాంగ్రెస్ గుండాలతో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై దాడి చేశారని, పోలీసులు మాత్రం ప్రేక్షక పాత్ర పోషించారాని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చెప్పుకుంటున్న ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా ఆని ప్రశ్నించారు.. లా అండ్ ఆర్డర్ అదుపుతప్పడానికి సీఎం రేవంత్ రెడ్డి కారణమని విమర్శించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ విధంగా వ్యవహరిస్తున్నారో అదే తరహాలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు వ్యవహరిస్తున్నారని గత బీఆర్ఎస్ పాలనలో ఎన్నడూ ఇలాంటి దాడులు జరగడంలేదని గుర్తుచేసారు.! బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన వారిపై చట్టరీత్య తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 11న మెగా జాబ్ మేళా

- జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించిన కూనంనేని
- సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా
- ట్రాన్స్ జెండర్స్, దివ్యాంగులకు కూడా అవకాశం
- 1000 నుంచి 2000 మందికి నిరుద్యోగులకు ఉపాధి అవకాశం



**కొత్తగూడెం, నవంబర్ 2 (ప్రజాజ్యోతి):** ఈనెల 11న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్ మేళా పోస్టర్ ను ఆదివారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో విడుదల చేశారు . ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...నవంబర్ 11వ తేదీన కొత్తగూడెం క్లబ్ నందు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదవ తరగతి నుండి డిప్లమా హోల్డర్స్, ఎం ఫార్మా, హోటల్ మేనేజ్మెంట్, డ్రైవర్స్, బిఈ, బీటెక్, ఎంటెక్, బిఎ,బిఎస్సి, బీకాం, ఎంబీఏ, ఎంసీఏ, ఎంసీఎస్, పోస్ట్ గ్రాడ్యుయేట్, ట్రాన్స్ జెండర్స్, చెవిటి మరియు మూగ దివ్యాంగులకు కూడా ఉద్యోగ అవకాశలు ఉన్నాయని తెలిపారు. నిరుద్యోగులకు ఇది చక్కని అవకాశం అని తెలిపారు. హెచ్ఆర్ హెల్ప్ లైన్ నెంబర్స్ (9000937805-9703142777-949114001) సంప్రదించవచ్చును. ఆన్లైన్ ద్వారా అప్లై చేసుకోవచ్చు అని తెలిపారు. ఈనెల 6 తేదీన అన్నికుల సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థల వారితో అలానే ఎమ్మార్వో, ఆర్డీవో, ఎండిఓ, స్థాయి అధికారులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ జాబ్ మేళా వల్ల 1000 నుంచి 2000 మంది నిరుద్యోగులకు అవకాశం లభించునుందని అన్నారు. సుమారు 61 పైగా కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎం షాల్మన్ రాజు, ఎస్ ఓ టు జిఎం కోటిరెడ్డి, మోహన్ రావు,మల్లికార్జున్, రాములు ఇతర సింగరేణి అధికారులతో పాటు కొత్తగూడెం సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్,కె షాబీర్ పాషా, సిపిఐ నాయకులు జమలయ్య, వాసిరెడ్డి మురళి, జక్కుల గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ సన్నిధిలో భారీ అన్న సమారాధన

- తరలివచ్చిన వేలమంది భక్తులు
- ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా
- అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు
- కుల, మతాలకు అతీతంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు







**అశ్వారావుపేట, నవంబర్ 02, ప్రజా జ్యోతి:** మండలంలోని వేదాంతపురం అటవీ ప్రాంతంలో కొలువు తీరివున్న శ్రీ వన దుర్గాంబికా సమేత వన లింగేశ్వరస్వామి వారి సన్నిధిలో ఆదివారం భారీగా వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కులమతాలకు అతీతంగా నిర్వహించిన ఈ సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. అమ్మవారి ఆలయాన్ని భక్తులు పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అశ్వారావుపేట మాజీ శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అశ్వారావుపేట మున్సిపల్ కమిషనర్ నాగరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగావాకింగ్ క్లబ్ ఆరోగ్య జీవన యాత్ర సభ్యులు వన సమారాధన

- ప్రధాన రహదారిలో ర్యాలీ
- వాకింగ్ యోగ వల్ల ఉపయోగాలు
- కార్యక్రమంలో వాడని ప్లాస్టిక్ ప్లేట్లు ప్లాస్టిక్ గ్లాసులు .





**జూలూరుపాడు నవంబర్ 2 ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కు చెందిన వాకింగ్ క్లబ్ మరియు ఆరోగ్య జీవన యాత్ర సభ్యులు సుమారు 70 మంది కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు నిత్యం వాకింగ్ చేయండి ఒక గంట అయినా అంటూ పాటను వినిపిస్తూ ప్రధాన రహదారిలో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు నల్లబండబోడు అటవీ ప్రాంతంలో పచ్చని వాతావరణం లో వనసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యోగా గురువు మల్లేశం హాజరయ్యారు. సుమారు 70 మంది సభ్యులు నిత్యం యోగ వాకింగ్ లాంటివి చేయడం అదేవిధంగా జన్మ దిన కార్యక్రమాలలో పండ్లతో కేకులు తయారు చేయడం లాంటి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు నిత్యం ఆరోగ్యం కోసం యోగ వాకింగ్ లాంటివి చేయాలని అదేవిధంగా ప్లాస్టిక్ లేకుండా చూసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు సభ్యులు చేస్తున్న కార్యక్రమాలను యోగ గురువు అభినందిస్తున్నారు. అనంతరం ఉత్సాహంగా ఉల్లాసంగా ఆట పాటలతో గడిపారు యోగ గురువు మల్లేశం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆకుల్లో భోజనాలు స్టీల్ గ్లాసుల్లో మంచినీళ్లు తాగి ప్లాస్టిక్కు నివారించేందుకు ప్రతి ఒక్కరు ఇలాంటి పద్ధతులను పాటించాలని సందేశం అందించారు.

## సత్తుపల్లి జెవిఆర్ఓసి బాయి బాట పట్టిన రజాక్



**కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 2 – ప్రజాజ్యోతి:** సింగరేణి కొత్తగూడెం ఏరియా సత్తుపల్లి జేవియర్ ఓపెన్ కాస్ట్ లో ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ శనివారం బాయి బాట కార్యక్రమం నిర్వహించారు. జేవియర్ ఓపెన్ కాస్ట్ పిట్ సెక్రటరీ రామారావు ఆధ్వర్యంలో రజాక్ బాయి బాట నిర్వహించి జేవియర్ ఓపెన్ కాస్ట్ ఉద్యోగుల సమస్యల గురించి తెలుసుకున్నారు. తక్కువగా ఉన్న వివిధ డిపార్ట్మెంట్ ల మ్యాన్ పవర్ నియమించాలని కోరినారు. హెమ్ స్పేర్ పార్ట్స్ తెప్పించి రిపేర్ చేయించాలని అలానే కొత్త హెమ్ మిషనరీ వచ్చేలా చూడాలని, ఉద్యోగస్తులు అందరికీ 75% ప్లేడే ఇవ్వాలని, స్థానిక పీవీఎన్ఆర్ సెంటెనరీ కాలనీలో మెరుగుపరచవలసిన మౌలిక సదుపాయాల గురించి మరియు వివిధ సమస్యల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్ జాయింట్ సెక్రటరీ ఎర్ర భాస్కర నాగ ప్రకాష్ , సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ మల్లారు కొమరయ్య అసిస్టెంట్ పిట్ సెక్రటరీ కోటి , సురేష్ చంద్ర శేఖర్, దావూద్ రఫీ , కిష్టారం పిట్ సెక్రటరీ బాలాజీ సిహెచ్ పిట్ సెక్రటరీ నగేష్ మురళి కిషన్ రావు శ్రీనివాస్ రమేష్ విజయ్ గోపి మున్వర్ ఖాన్ లింగమూర్తి నాగేశ్వర రావు ఇతర ఐఎన్టీయూసీ ముఖ్య నాయకులు పాల్గొనడం జరిగింది.

## జగన్మోహిని అలంకారంలో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య

- **చిలుకు ద్వాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు పాల్గొన్న దేవస్థానం ఈవో దంపతులు**



**భద్రాచలం, నవంబర్ 2,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారు కార్తీకమాసం చిలుకు ద్వాదశి సందర్భంగా ఆదివారం జగన్మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఆలయంలో కార్తీక మాస పూజలు నిర్వహించారు. నిత్యకల్యాణ మండపం వద్ద జగన్మోహిని అలంకార రూపుడైన స్వామి వారిని ఆసీనులను చేసి హరిదాసులు కీర్తనలను ఆలపిస్తుండగా వైదిక సిబ్బంది స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర్రావుదంపతులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై దాడులు చేయడం హేయమైన చర్య

- **ప్రజాస్వామ్యంలో పార్టీ కార్యాలయల పై దాడులు ఏమిటి**
- **బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం**
- **అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత**
- **పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేసి అన్యాయంగా ఆక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి**



**భద్రాచలం, నవంబర్ 2,ప్రజాజ్యోతి :** మణుగూరు మండలంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై దాడి చేసి ఫర్నిచర్ కౌన్సిల్ చేసి. పార్టీ కార్యాలయాన్ని ఆక్రమించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు కరెక్ట్ కాదని బిఆర్ఎస్ భద్రాచలం మండల కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆకోజు సునీల్ కుమార్ మాట్లాడుతూ మణుగూరు మండల పార్టీ కార్యాలయం కు సంబంధించిన అన్ని పత్రాలు రేగా కాంతారావుగారి పేరు మీద ఉన్నాయని, చట్ట ప్రకారం అన్ని అనుమతులు ఆయనకు ఉన్నప్పటికీ చట్టాన్ని అతిక్రమించి దాడి చేసి పార్టీ కార్యాలయాన్ని స్వాధీనపరచుకోవడం కాంగ్రెస్ పార్టీ నైజానికి నిదర్శమని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల నేపథ్యంలో మణుగూరు మండ లానికి సంబంధించిన పార్టీ కార్య కర్తలు, నాయకులు ఎన్నికల ప్రచారంలో ఉండగా ఎవరూ లేని సమయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దౌర్జన్యం చేసి పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేసి దాడి చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి తెలంగాణ రాష్ట్రం అంతటా కూడా చట్టాన్ని చేతిలోకి తీసుకోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయాల పై దాడులు చేస్తున్నారని, 8 నెలల క్రితం భువనగిరి లో ,ఆదివారం మణుగూరు.లో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దల అండ ద్వారానే ఈ సంఘటన జరిగింది ఇలా మీరు దాడులు చేస్తే బయపడేవారు లేరు అని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కో కన్వీనర్ రేపాక పూర్ణచంద్రరావు, సీనియర్ నాయకులు బత్తుల నరసింహులు, కల్లూరి శ్రీరాములు, అంబటి కర్ర కృష్ణ, అయినాల రామకృష్ణ, బాడిశ నాగరాజు, సతీష్, కాపుల సూరిబాబు, ఆకోజు పృద్వి, రావూరి రవి కిరణ్, బద్ది బాబి, రమేష్, కొలిపాక శివ, కావూరి సీతామహాలక్ష్మి, తెల్లం కామేశ్వరి, ఏలూరి ప్రియాంక, పాల్గొన్నారు.

## నర్సింగ్ వృత్తి బాధ్యతతో నిర్వహించాలి.

- **అదనపు జిల్లా వైద్యశాఖ అధికారి డాడి, సైదులు**



**భద్రాచలం, నవంబర్ 2,ప్రజాజ్యోతి :** నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైందని, సమాజంలో బాధ్యతాయుతంగా సేవ చేసే అవకాశం మీకు లభించడం ఎంతో ఆనందంగా ఉందని అదనపు జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ డి. సైదులు అన్నారు. భద్రాచలంలో ఆదివారం మారుతి పారా మెడికల్ నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో బిఎస్సీ మొదటి సంవత్సరం మరియు జిఎన్ఎం మొదటి సంవత్సరం విద్యార్థినులకు క్యాపింగ్ సెర్మనీ కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి బాధ్యతతో కూడి ఉన్నదని, విధి నిర్వహణలో లోపం లేకుండా నైపుణ్యతతో నిర్వహించాలని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ డాఎస్.ఎల్.కాంతారావు మాట్లాడుతూ నర్సింగ్ వృత్తిలో శిక్షణ పొందిన వారికి అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, స్వదేశంతో పాటు విదేశీ ఉద్యోగాలు, ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగాలు పొందవచ్చని వివరించారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత 100 శాతం తీసుకువచ్చేందుకు నూతన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బి. సుబ్బరాజు, యం. వి. కోటిరెడ్డి, పుల్లయ్య, యం. రామకృష్ణ, డా ఆర్. చైతన్య, జి.వి.వి.సుదర్శన్రావు, జయభారతి, మారుతి నర్సింగ్ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా కార్తీక దీపోత్సవం – భక్తులతో కిటకిటలాడిన శ్రీ కనకదుర్గ దేవస్థానం



**పాల్వంచ(రూరల్), నవంబర్ 2(ప్రజా జ్యోతి):** కేశవాపురం–జగన్నాధపురం గ్రామాల పెద్దమ్మగుడిలో కార్తీకమాసం సందర్భంగా దీపోత్సవం, తులసీ–ఉసిరి కళ్యాణం ఘనంగా నిర్వహించారు.శ్రీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామివారికి పంచామృతాభిషేకం, లక్ష బిల్వర్చన,హారతులు నిర్వహించారు.ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమార్,చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు,ధర్మకర్తలు పెండ్లి రామిరెడ్డి,చెవుగాని పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## రామాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు

- **భధ్రాద్రి రామయ్యకు ప్రత్యేక అభిషేకం, స్వర్ణ పుష్పార్చన సేవ**



**భద్రాచలం, నవంబర్ 2,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఆదివారం ఆర్జిత సేవలో భాగంగా రూ.500 టిక్కెట్ పై సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. చిత్రకూట మండపంలో జరిగిన ఈ వ్రతాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే అంతరాలయంలో ఆర్జిత సేవలో భాగంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక అభిషేకం, బంగారు పుష్పాలతో ప్రత్యేక అర్చన వైదిక సిబ్బంది నిర్వహించారు. నిత్యకల్యాణ మండపంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది.

## సింగరేణిలో మారు పేర్ల విజిలెన్స్ పెండింగ్ సమస్యను పరిష్కరించండి

- **ఎమ్మెల్యే కూనంనేనికి బాధితుల వినతి పత్రం**



**కొత్తగూడెం నవంబర్ 2 (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థలో 30 ఏళ్లు సర్వీసు పూర్తి చేసి అనారోగ్య కారణాల వలన కార్పోరేట్ మెడికల్ బోరు వారిచే మెడికల్ ఇన్వాలిడేట్ అయి, డిపెండెంట్ ఉద్యోగం కొరకు దరఖాసు చేసుకుంటే విజిలెన్స్ అధికారులు మారు పేర్లపై ఉద్యోగం చేసినారని, రెండు పేర్లు ఉన్నాయనే కారణంతో దరఖాస్తు చేసుకున్న మాకు డిపెండెంట్ ఉద్యోగమును ఇవ్వకుండా గత 15 సంవత్సరాల నుండి మమ్ముల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని,మాకు సకాలంలో సింగరేణి ఉద్యోగం రాక, ఎలాంటి ఉపాధి మార్గం లేక మేము ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతూ కుటుంబ పోషణ భారంగా వెళ్లదీస్తున్నాము అని గతంలో మారుపేర్ల సమస్యను పరిస్కరించి విజెలన్స్ పెండింగ్ కేసుల బాధితులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తాం అని సింగరేణి యాజమాన్యం మరియు కార్మిక జాతీయ సంఘాలు కలిసి లేబర్ కమీషన్ (ఆర్ఎల్సీ) వారి సమక్షములో ఒప్పందం జరిగిందని, ప్రభుత్వం దృష్టికి మా సమస్యను తీసుకెళ్లి,మాకు సత్వరమే ఉద్యోగ నియామకం కల్పించి, మా కుటుంబాలను ఆదుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వినతి పత్రాన్ని బాధితులు అందించి వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సురయ్య, రమేష్, నగేష్, లాలు, పెంటయ్య, పాప, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భవన్ పై దాడిని ఖండించిన కాపు సీతామాలక్ష్మి

- దాడులకు పాల్పడిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి
- అధికారాన్ని అడ్డం పెట్టుకుని దాడులు చేయడం సరి కాదు



**కొత్తగూడెం నవంబర్ 2 (ప్రజాజ్యోతి):** మణుగూరు తెలంగాణ భవన్ పై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో దాడులకు తెగబడటం సరికాదని హితవు పలికారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజాస్వామికంగా భౌతిక దాడులు చేస్తోందని తెలిపారు. నాడు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కార్యాలయంపై, అలాగే మాజీమంత్రి హరీష్ రావు కార్యాలయం పై ఇదేవిధంగా దాడులు చేశారని గుర్తు చేశారు. తమ సొంత ఇంటిని పార్టీ కార్యాలయంగా మార్చుకుని జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తున్నారని తెలిపారు . బీఆర్ఎస్ కార్యకర్తలను భౌతికంగా గాయపరిచి, పార్టీ కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం చేసి నిప్పు పెట్టిన కాంగ్రెస్ గూండాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధ్వంసకర వాతావరణ సృష్టించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

## ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య



**టేకులపల్లి,నవంబర్02,ప్రజాజ్యోతి:** మండలంలోని కొండగులబోడు గ్రామానికి చెందిన ఓ యువకుడు చీరతో ఉరివేసుకున్న సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం... మండలంలోని కొండగులబోడు గ్రామానికి చెందిన భూక్య బద్రు, బాజులకు ముగ్గురు కుమారులు వీరిలో చిన్న కుమారుడైన భూక్య వినోద్ (28) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వినోద్ కొత్తగూడెం హోండా షోరూం లో పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవురోజునా ఇంట్లో ఉన్నాడు. తల్లిదండ్రులు వ్యవసాయ పనులు నిమిత్తం వెళ్ళి వచ్చే సరికి ఇంటి తలుపులు వేసి ఉన్నాయి అని తెలిపారు. ఈ క్రమంలో తలుపులు పలుగకొట్టి తీయగా వినోద్ ఉరి వేసుకోని ఉన్నాడు.దీంతో ఒకేసారిగా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. టేకులపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఐక్యత భావం ముఖ్యం:: సాధికారతతోనే గిరిజన మహిళల అభివృద్ధి

- విద్య ఆరోగ్య రంగాల్లో ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించడమే లక్ష్యం
- అంగరంగ వైభవంగా గోండ్ రాణి దుర్గామాత 501 వ జయంతి వేడుకలు
- గిరిజన సంస్కృతి సారాన్ని చాటి చెప్పిన ఆదివాసీ మహిళలు





**అశ్వారావుపేట, నవంబర్ 02,ప్రజాజ్యోతి :** ఆదివాసి తెగల మహిళలు సామాజికంగా ఆర్థికంగా ముందుకు వచ్చేందుకు ప్రతి ఒక్కరికి ఐక్యత భావం ముఖ్యమని ఉస్మానియా యూనివర్సిటీ లా ప్రొఫెసర్ గుమ్మడి అనురాధ ఆదివాసీ మహిళా శక్తి ప్రధాన కార్యదర్శి ఇరప అనసూయ అన్నారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రంలోని సోయం గంగులు ప్రాంగణంలో గోండ్ రాణి దుర్గామాత 501 వ జయంతి ఉత్సవాలు ఆదివాసీ మహిళా చైతన్య శక్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వివేకానంద కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుండి ఆదివాసి మహిళలు, యువతులు సాంప్రదాయ దుస్తులు మట్టి బిందెలు, డోలు వాయిద్యాలు, కొమ్ము నృత్యాలతో ప్రతి ఒక్కరూ ఆకుపచ్చ జండాలు చేతబుని భారీ ర్యాలీగా సోయం గంగులు ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. ప్రాంగణానికి చేరుకున్న అనంతరం ఆదివాసి మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి గిరిజన పెద్దలు వారి సాంప్రదాయం అనుసరించి నైవేద్యాన్ని సమర్పించే దీప ప్రజ్వలన చేశారు. అనంతరం గిరిజన పెద్దలు మాట్లాడుతూ ఎస్టీ జాబితాలో లంబాడీలు చట్టబద్ధత లేకుండా హక్కులు పొందుతున్నారని వారిని ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆదివాసి మహిళాలు ఆర్థిక స్వాలంబన సాధించేందుకు, విద్య ఆరోగ్య రంగాల్లో ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. గిరిజన గిరిజన సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళలు సాధికారిక సాధించాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. చిన్నారులు తమ సాంప్రదాయ భాషల్లో దుర్గామాత వీరగాథలను నాట్య రూపంలో ప్రదర్శించిన తీరు పలువురిని ఆకట్టుకుంది ఈ కార్యక్రమంలో పలు గిరిజన నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సాంస్కృతిక సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల స్వప్నాల సాఫల్యం కోసం పోరాడుదాం

- నవంబర్ 1నుంచి 7వరకు సంస్మరణ సభలను జయప్రదం చేయండి
- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య



**కొత్తగూడెం నవంబర్ 2 (ప్రజాజ్యోతి):** జిల్లా కేంద్రంలో ప్రజా పంథా ఆఫీస్ వద్ద సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కొత్తగూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా ఆదివారం అమరవీరుల వర్ధంతి సభ,అమరులకు నివాళులర్పించరు. ఈ కార్యక్రమనికి జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం అధ్యక్షత వహించగా ఇల్లందు మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర నాయకులు గుమ్మడి నరసయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే. రంగారెడ్డిలు మాట్లాడుతూ వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రత్యేకించి 58 ఏడ్ల భారత కమ్యూనిస్టు విప్లవోద్యమంలో ప్రజల కోసం ఈ దేశంలో ప్రజాతంత్ర సోషలిస్టు విప్లవం కోసం పోరాడి ఎందరో ప్రాణాలర్పించారు, భారత దేశంలో వర్గ పీడన దోపిడి కుల వ్యవస్థ మతాలు మూఢనమ్మకాలు సాంఘిక రాజకీయ అసమానతలు ఆర్థిక అంతరాలు పోవాలని మనిషిని మనిషిపీడించే సమాజం అంతరించి నిండైన మెండైన ప్రజాస్వామ్యక సమాజం రావాలని సోషలిస్టు సమాజం స్థాపించాలనే ఆశయాన్ని వారెంచుకున్నారు అని ఆ ఆశయం తెలుగులో వారు యావత్తు జీవితాన్ని సమాజ మార్పు కోసం వేచించారు అన్నారు. ప్రజలను కూడగట్టి ఎన్నో పోరాటాలు ఉద్యమాలు నిర్వహించారు. అరుణ పథకాన్ని సమర పతాకంగా నిలబెట్టారు. ప్రజలను ఉద్యమశిలురుగా తీర్చిదిద్ది. ఎందరో కార్యకర్తలను ఉద్యమకారులుగా. రాజకీయవేత్తలుగా తీర్చిదిద్ది ముందుకు పార్టీని నడిపించారు అని నిర్బంధాలను, కుట్ర కేసులను, ప్రభుత్వ, పోలీస్, భూస్వామ్య, పెట్టుబడి దారి వర్గాల దాడులను ఎదుర్కొని ఉద్యమాన్ని నిలబెట్టారు అన్నారు. రైతు, కూలీ, కార్మిక, విద్యార్థి, మహిళా, యువజన, మెదో రంగాలలో కృషి చేసి ఎందరినో రాజకీయ. సిద్ధాంత శీలురుగా తీర్చిదిద్దారు అని వారందరికి వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పించారు. వారి ఉన్నంత ఆశయాలను ముందుకు తీసుకు పోతామని,వారి రాజకీయ సిద్ధాంత కృషిని, ఆచరణలో మరింత మెరుగ్గా కాలమాన పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చేసుకొని విప్లవ కృషిని,వారి త్యాగనీరతిని ఉన్నంతగా కొనసాగిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ. జిల్లా నాయకులు నాయిని రాజు, అమరలపూడి రాము,కే కల్పన, నూప భాస్కర్, జాటోత్ కృష్ణ.,గోకినపల్లి ప్రభాకర్, ఆర్ మధుసూదన్ రెడ్డి, బి ధర్మ, వై గోపాల రావు,పి.సతీష్. ఏం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 26న మాదిగ వనభోజనాలు

- వనభోజనాల రూపకర్త చదలవాడ సూరి
- అంబేద్కర్ విగ్రహం వద్ద వనభోజనాల పోస్టర్ విడుదల



**కొత్తగూడెం నవంబర్ 2 (ప్రజాజ్యోతి):** జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం దగ్గర మాదిగ యువకులు,విద్యార్థులు, కళాకారులు,ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరు అయ్యి డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, మాదిగ వనభోజనాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గూడెల్లి యాకయ్య, మంద వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 26వ తేదీన లక్ష్మీదేవిపల్లి మండలం రామచంద్రా డిగ్రీ కాలేజీ ఎదురుగా ఉన్న మామిడి తోటలో మాదిగ వనభోజనాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ వనభోజన కార్యక్రమానికి కొత్తగూడెం నియోజకవర్గంలోని ప్రతి పల్లె నుంచి యువకులు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, ప్రతి కుటుంబం కూడా ఈ వనభోజనాల కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని, మాదిగల ఐక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో చదలవాడ సూరి, మోదుగు జోగారావు, వేల్పుల భాస్కర్, వానపాకుల రాంబాబు, ఉలవులపూడి జానకిరామ్, గుండేటి వెంకట్, రాములు పుల్లూరి కుమార్, దూడపాక శివ ప్రసాద్, కత్తి బాలకృష్ణ, కొప్పుల రమేష్, కేశపాక వెంకటేశ్వర్లు, తోకల వెంకటేశ్వర్లు, బొట్ల శ్రీను, గణిపాక సుధాకర్, ఐలపొంగు సురేష్, మొగిలిపాక మురళీకృష్ణ, ప్రవీణ్, ఇనపనూరి రమేష్, కుంపటి నాగరాజ్, చదలవాడ సామిల్, కాకటి బాబు, ఓదెల శంకర్, కందే చంద్రకుమార్, కోతర్ల యశ్వంత్ కుమార్, డేవిడ్, చదలవాడ రాము, ముస్కూరి ప్రభు, చుట్టుగుళ్ళ రాంబాబు, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.